
సాక్షి ఒడిశా
సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.37,194లు వచ్చాయని అధికారులు తెలిపారు.


కోణార్క్‌లో ఉద్రిక్తత
కోణార్క్ సూర్యదేవాలయం వద్ద ఆదివారం ఉద్రిక్తత ఏర్పడింది. టికెట్ల జారీలో జాప్యంపై సందర్శకులు మండిపడ్డారు.
- 8లో


అమ్మకాలు అదరహో..!
మహానగర్ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పల్లిశ్రీ మేళాకు జనం పోటెత్తుతున్నారు. హస్తకళా వస్తువులు పెద్ద ఎత్తున అమ్ముడుపోతున్నాయి.
- 8లో

న్యూస్‌రీల్

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు


నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

రాయగడ: చోరీ కేసులో ఇద్దరు నిందితులను రామనగుడ పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2.79 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించారు. ఏఎస్‌ఐ పృథ్వీరాజ్ ఝుంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామనగుడ ప్రధాన మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్న సునీల్ పాలాయ్ వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రూ.2.60 లక్షలను తన ఇంటిలో ఉంచి బుధవారం మార్కెట్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లి చూసేసరికి డబ్బులు కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశా. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం ససౌఅచవా గ్రామానికి చెందిన సహదేవ్ బౌరి, దుర్గాప్రసాద్ బౌరిలను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ.2,79,180 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వానికి దురువా ప్రజల కృతజ్ఞతలు


మాట్లాడుతున్న చంద్ర సాగరియ

జయపురం: దశాబ్దాల పోరాటం ఫలించి దురువ సంప్రదాయ ప్రజలను ఆదివాసీలుగా గుర్తించినందుకు దురువ ఆదివాసీ మహిళ మహాసంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కుంద్రా సమితి బాగ్దేరీ గ్రామ పంచాయతీ బుధగుడ గ్రామంలో దురువ ఆదివాసీ మహిళ మహాసంఘం ఆధ్వర్యంలో బంధుమిలన్ కార్యక్రమం నిర్వహించారు. దురువ సమాజ్ సలహాదారు చంద్ర సాగరియ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా భాత్ర వికాస్ పరిషత్ అధ్యక్షుడు నీలకంఠ పూజారి, కొరాపుట్ సమితి చతర్ల ప్రాంత సమాజ సేవీ రంజిత్ పట్నాయక్, మాజీ కౌన్సిలర్ నరేంద్ర మఖి తదితరులు హాజరయ్యారు. అనంతరం సంఘ కార్యదర్శి కావేరీ దురువ, చంద్ర సాగరియ మాట్లాడుతూ సంఘటితంగా పోరాడటం వల్లే విజయం సొంతమైందని, ఇందుకు సీఎం నవీన్ పట్నాయక్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా ప్రతినిధి హరీష్‌కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో క్లబ్ సభ్యులు

రాయగడ: ప్రతి రోజూ వాకింగ్ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని సాయిప్రియనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో నడక ఆవశ్యకత తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాయామంలో నడకను భాగం చేసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పటిష్టతకు కృషి


పర్లాకిమిడిలో పార్టీ నాయకులతో సమావేశమైన జ్యోతి రంజన్ మహాపాత్రో

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి జ్యోతి రంజన్ మహాపాత్రో అన్నారు. భువనేశ్వర్ నుంచి ఆదివారం పర్లాకిమిడి విచ్చేసిన ఆయన ఆర్అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పర్లాకిమిడి నియోజకవర్గం నుంచి అభ్యర్థిని బరిలోకి దించుతామని ప్రకటించారు. కొరాపుట్, మల్కనగిరి, గంజాం, కొంధమాల్, భౌధ్, భువనేశ్వర్, కటక్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పోటీ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పైల మురళీకృష్ణ, జిల్లా సెక్రటరీ ఇన్‌చార్జి సంతోష్ కుమార్ సాహు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

- వైభవంగా మహానగర్ మహోత్సవాలు
- ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

బరంపురం : స్థానిక ఖల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మహానగర్ మహోత్సవాలు అంబరాన్ని తాకుతున్నాయి. శనివారం రాత్రి జరిగిన మహోత్సవాలల్లో ప్రదర్శించిన పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. సంబల్‌పూరి తదితర నృత్య రీతులతో పాటు జిల్లాకి చెందిన వివిధ కళాకారులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వీరిని ఉత్సవ కమిటి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంజాం హోటల్స్ సంఘం అధ్యక్షుడు ఉమాకాంత్ పాణిగ్రాహి, బీడీఏ మాజీ చైర్మన్ సుభాష్ మహరణ, గోపాల్ పట్నాయక్, సుదీప్ సాహు, నిరో మంకుడోతో పాటు వేలాది మంది సందర్శకులు పాల్గొన్నారు.


ప్రత్యేక ఆకర్షణగా సంబల్‌పూరీ నృత్యం


సత్కారం అందుకుంటున్న కళాకారులు


గంజాం కళాకారులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు


ఆకట్టుకున్న యువతీ యువకుల నృత్య ప్రదర్శన


అలరించిన గంజాం సంప్రదాయ మృదంగ మేళా

చిలికాలో చిక్కుకున్న పడవ


సరస్సులో ప్రయాణికులతో చిక్కుకున్న పడవ

భువనేశ్వర్: చిలికా సరస్సు నడిబొడ్డున ఆదివారం మర పడవ చిక్కుకుంది. ఇందులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. పూరీ జిల్లా సతొపొడా సమీపంలోని చిలికా సరస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. పడవ ఇంజిన్‌లో సాంకేతిక లోపమే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. జొహ్నికుదా నుంచి సతొపొడా తీరానికి ప్రయాణికులను తీసుకువెళుతుండగా పడవ ఇంజన్ మొరాయించింది. ఆ సమయంలో ప్రయాణికులతో పాటు 80కి పైగా ద్విచక్ర వాహనాలు, ఇతర వస్తువులు కూడా రవాణా అవుతున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక మత్స్యకారులు రంగంలోకి దిగి ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులను ఆదుకున్నారు. మరో వైపు అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

నిత్యం తప్పని వెతలు..

సరస్సు సమీపంలో సుమారు 92 గ్రామాల ప్రజలు జీవనోపాధిని పొందేందుకు రోజు వారీ రాకపోకల కోసం పడవపైనే ఆధారపడుతున్నారు. ప్రధాన భూ భాగానికి చేరుకోవడానికి చిలికా సరస్సు గుండా 5 కిలోమీటర్లు దాటాల్సిందే. తుఫాను వంటి ప్రకృతి వైపరీత్యాలు, ఇతర యాంత్రిక సమస్యలతో పడవలు తరచుగా సరస్సు లోపల చిక్కుకుపోయి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ఆయా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు.

సీఎం శిక్షా అవార్డుల ప్రదానం


జయపురం: ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

జయపురం: స్థానిక దసరా పొడియ మైదానంలో శనివారం సాయంత్రం జిల్లా స్థాయి ముఖ్యమంత్రి శిక్షా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. 2128 మంది ఉపాధ్యాయులకు సీఎం శిక్షా అవార్డులను అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి రామచంద్ర నాయిక్ స్వాగతోపన్యాసం చేయగా.. అవార్డు గ్రహీతలు ప్రసంగించారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళిక బోర్డు అధ్యక్షుడు రఘునాథ్ పడాల్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, పొట్టంగి ఎమ్మెల్యే ప్రీతమ్ పాఢీ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభు జాని, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి దయామయ పాఢీ, సమన్వయ ఆదివాసీ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రణయ రంజన్ బెహరా, జయపుర మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, బీడీఓ శక్తి మహాపాత్రో, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రూపచంద్ర సొరెన్, అదనపు జిల్లా విద్యాధికారి జగన్నాథ భొత్ర, బీఈఓ చందనకుమార్ నాయిక్, జిల్లా విద్యా కోఆర్డినేటర్ భరత్ కుమార్ పాఢీ, బీఓ శ్రీకాంత కుమార్ జాని, టి.మీనతి తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జిల్లాలో 1800 మందికి ముఖ్యమంత్రి విద్యాపురస్కారాలను ఆదివారం గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ జిల్లాలో ఇంతమందికి విద్యాపురస్కారాలు లభించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 5టి పథకం ద్వారా పాఠశాలలను ఆధునీకరించడంతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళ్లాలన్న ఉద్దేశంతో అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, అమో ఒడిశా నవీన్ ఒడిశా జిల్లా సమన్వయకర్త పట్నాన గౌరిశంకరరావు, ఏడీఎం భాస్కర రైతా, జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి తదితరులు పాల్గొన్నారు.


జయపురం: హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు


రాయగడ: వేదికపై సరస్వతి మాఝి, ముదులి, రైతా తదితరులు

బీజేడీ నుంచి బీజేపీలోకి..!

- అధికార పార్టీకి గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి దేబాశిష్ నాయక్
- పార్టీ తనను నిర్లక్ష్యం చేస్తుందంటూ ఆవేదన
- కాషాయం గూటికి చేరిక


బీజేపీలో చేరిన మాజీ మంత్రి దేబాశిష్ నాయక్

భువనేశ్వర్ :త్వరలో జరగనున్న ఎన్నికలకు ముందు అధికార బిజు జనతా దళ్ (బీజేడీ)కి సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ మంత్రి దేబాశిష్ నాయక్ రాజీనామా చేశారు. బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు రాసిన లేఖలో మాజీ మంత్రి, వరుసగా 4 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన తక్షణమే ప్రాంతీయ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు నిర్ణయాన్ని తెలియజేశారు. ఇంతకు ముందు రాష్ట్ర శాసన సభలో బొరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన దేబాశిష్ నాయక్ రాజీనామాకు గల కారణాన్ని పేర్కొనలేదు. అయితే పార్టీలో తనను నిర్లక్ష్యం చేశారనే భావనతోనే దేబాశిష్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈయన 2000, 2004, 2009, 2014లో బిజూ జనతాదళ్ అభ్యర్థిగా జాజ్‌పూర్ జిల్లా బొరి శాసనసభ స్థానం నుండి వరుసగా నాలుగు సార్లు ఎన్నికయ్యారు.

బీజేపీలో చేరిక..

అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ)కి ఆదివారం రాజీనామా చేసిన కొన్ని గంటలకే దేబాశిష్ నాయక్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఇతర సీనియర్ నాయకుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కాషాయ కండువా కప్పుకున్నారు. మాజీ మంత్రిని మన్మోహన్ సామల్ స్వాగతిస్తూ ఆయన పార్టీలో చేరడం వల్ల జాజ్‌పూర్, పరిసర ప్రాంతాలలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

400 మందికి పెన్షన్ల పంపిణీ


లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న అతిథులు

జయపురం: మునిసిపాలిటీ పరిధిలోని 28 వార్డులలో 400 మంది లబ్ధిదారులకు మధు బాబు పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక బాబాసాహెబ్ కళ్యాణ మండపంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వచ్చే నెల నుంచి ప్రతి పెన్షన్‌దారునికి నెలకు రూ.1000 అందనున్నాయని చెప్పారు. పక్క రాష్ట్రాలతో పోల్చితే తక్కువే అని, మరింత పెన్షన్ పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్ జస్పాల్ సింగ్ భొగల్, గోపీనాథ్ మహంతి, ప్రణభ కిశోర్ నాయిక్, సింహాచల బిశాయి, మధుస్మిత ఓరాన్, దేవేంద్ర చౌదురి, విష్ణువర్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ వనిత మహాపాత్రో

జయపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. జయపురం వనిత యాక్టివిటీ విద్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు మొక్కల సంరక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వనిత మహాపాత్రో నేతృత్వంలో చిన్నారులతో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్బూజా కాయలకు గిరాకీ


బస్టాండ్‌లో కర్బూజా కాయలు విక్రయిస్తున్న రైతు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే సూర్యుడి ప్రతాపం ఎక్కువగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెంటీగ్రేడ్ దాటడంతో బయటకు రావాలంటనే జనం భయపడుతున్నారు. ఈ తరుణంలో కర్బూజా కాయలు ప్రజలకు ఎండ నుంచి కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి. కొత్త బస్టాండ్, కాశీనగర్ ప్రాంతాల్లో కిలో రూ.25 చొప్పున కాయలు విక్రయిస్తున్నారు. వీటిని తినడం ద్వారా డీహైడ్రేషన్ బారినుంచి తప్పించుకోవచ్చని భావిస్తున్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి


సమాజ సేవకులను సత్కరిస్తున్న ప్రతినిధులు

రాయగడ: సమాజ శేయస్సు కోరి మంచి వార్తలు రాయాలని ఒడియా దినపత్రిక నిర్భయ్ ముఖ్య సంపాదకుడు నవీన్ దాస్ అన్నారు. స్థానిక హోటల్లో ఆదివారం ప్రెస్ యూనియన్ 8వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిగా అధ్యయనం చేశాకే వార్తా కథనాలు రాయాలన్నారు. అయితే ఇటీవల కొంతమంది సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం ఆధారంగా వార్తలు పంపిస్తున్నారని, అలా రాయడం వల్ల సృజనాత్మకత లోపిస్తుందని చెప్పారు. అనంతరం సమాజ సేవకులను సత్కరించారు. రాయగడ ప్రెస్ యూనియన్ అధ్యక్షుడు మావుడి బారిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గంజాం జిల్లా ఛత్రపూర్ మహిళా కళాశాల ఒడియా అధ్యాపకుడు డాక్టర్ అజయ్ కుమార్ త్రిపాఠీ, ఓం శాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఢిల్లీ) జాతీయ మీడియా కోఆర్డినేటర్ సుశాంత్ బెవురియా, యూనియన్ ముఖ్యకార్యదర్శి శివాజీ దాస్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ విజయం ఖాయం

- పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్
- టిక్కెట్ల కోసం 10,000 దరఖాస్తులు

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజూ జనతా దళ్ చరిత్రాత్మక విజయం సాధిస్తుందని, వరుసగా 6వసారి నవీన్ పట్నాయక్ రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టడం ఖాయమని ఆ పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్‌ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తమ పార్టీకి విశేష ప్రజాదరణ ఉందన్నారు. నవీన్ పట్నాయక్‌పై ప్రజల్లో విశ్వాసం గణనీయంగా పెరిగిందని, అనేక మంది నిపుణులు, జాతీయ పార్టీల అభ్యర్థులతో సహా 10,000 మంది త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు బిజూ జనతా దళ్ టిక్కెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పెద్ద ఎత్తున వృత్తిదారులు, జాతీయ రాజకీయ పార్టీల నేతలు కూడా దరఖాస్తులు చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. నాలుగున్నర కోట్ల మంది ఒడిశా ప్రజల ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో బీజేడీ గొప్ప విజయం సాధించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడం నవీన్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకం, విశ్వాసాన్ని తెలియజేస్తోందని చెప్పారు. ఇటీవల అన్ని జాతీయ స్థాయి సర్వే నివేదికలు నవీన్ పట్నాయక్ దేశంలో నంబర్-1 ముఖ్యమంత్రిగా నిలిచారని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. 2022 పంచాయతీ ఎన్నికల్లో 52 శాతానికి పైగా ఓట్లను సాధించడం ద్వారా, బీజేడీ రాష్ట్రంలో నంబర్-1 రాజకీయ పార్టీ అని నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన మోదీ సర్కారు

పర్లాకిమిడి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఐదేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. గజపతి జిల్లా యువ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రోజ్‌గార్ ఇవ్వండి, న్యాయం చేయండి అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగారాష్ట్ర యువకాంగ్రెస్ ప్రహరీ చిన్మయకుమార్ హోత్తా, మాజీ కౌన్సిలర్ అభిమన్యుపండా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత్ కుమార్ పండా, యువ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్య నారాయణ పాత్రో మాట్లాడుతూ మోదీ సర్కారు ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా నిరుద్యోగులను తీవ్రంగా నిరాశ పరిచిందని దుయ్యబట్టారు. నిరుద్యోగ సమస్యపై రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.


పర్లాకిమిడిలో యువ కాంగ్రెస్ నాయకుల నిరసన

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో నేషనల్ లా ట్రిబ్యునల్ సభ్యుడు



బద్రీనాథ్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ రమేష్‌బాబు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని నేషనల్ లా ట్రిబ్యునల్ సభ్యుడు (హైదరాబాద్ బెంచ్) డాక్టర్ నందుల వెంకట రామకృష్ణ బద్రీనాథ్ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆయనకు అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుంది



గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద ఇరుకున్న ఆర్టీసీ బస్సు

నరసన్నపేట: విశాఖ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద ఆదివారం ఇరుక్కుపోయింది. విశాఖ నుంచి గుణుపూర్ వెళ్లేందుకు వస్తున్న ఆర్టీసీ బస్సు నరసన్నపేట టౌన్ లోనికి వచ్చేందుకు సత్యవరం కూడలి వద్ద కట్ చేయాలి. డ్రైవర్‌కు ఈ దారి కొత్త కావడంతో ముందుకు వెళ్లి గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద నుంచి మారుతీ నగర్ మీదుగా నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు బస్సు తిప్పారు. దీంతో ఫ్లై ఓవరు వంతెన పై భాగం బస్సుకు తగలడంతో బస్సు ముందుకు కదల్లేదు. కాసేపటి తర్వాత టైర్లలో గాలి తగ్గించి వెనక్కి తీసుకువచ్చారు. మళ్లీ గాలి నింపి బస్సును యథావిధిగా తరలించారు. రెండు గంటల సమయం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

'రోగిని బంధువులా భావించాలి'



వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రోగిని బంధువుగా భావించి వైద్యం అందించాలని, అప్పుడే రోగి వైద్యుడిని దేవుడిలా చూస్తారని జెమ్స్ కళాశాల అధినేత బొల్లినేని భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పేద రోగులకు సాయం చేయాలని కోరారు. హౌస్ సర్జన్ అయిపోయాక పీజీ కోసం రెండు నెలలు కష్టపడితే అనుకున్న గోల్ రీచ్ అవుతామని చెప్పారు. సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఆస్పత్రి చైర్మన్ గురువారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల ఎంబీబీఎస్ ఒక ఎత్తు అయితే, జీవితాన్ని చదవాల్సిన సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నారు. వైద్యంపై ఆసక్తి ఉండి చిన్నతనం నుంచే దాన్ని సాధించే దిశగా పరీక్షలు రాశారని, మీ తల్లిదండ్రుల కలలను సాకారం చేసే రోజు వచ్చిందన్నారు. ప్రతి వైద్యుడు కొత్త పాఠం రోగి నుంచే నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించి పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ సీఈఓ బొల్లినేని అద్విక్, సీఏఓ రామ్మోహన్‌రావు, జనరల్ మెడిసిన్ వైద్యులు సుధీర్, సూపరింటెండెంట్ అశోక్, ప్రిన్సిపాల్ లిలిత, ఆర్‌ఎంఓలు బాల మురళీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి



మృతుడు యవ్వారి ప్రసాద్ (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి-టెక్కలిపట్నం రహదారి భావనాపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొంపాపురం గ్రామానికి చెందిన యవ్వారి ప్రసాద్(32) అనే మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి చెందారు. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముక్తాపురం పంచాయతీ, చొంపాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ బైక్‌పై వెళ్తూ భావనాపురం గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్ మర్చంట్ నేవీలో పనిచేస్తున్నాడు. గత ఏడాది మే నెలలోనే వివాహమైంది. ఇటీవలే పాప కూడా పుట్టింది. సెలవుల్లో ఇంటికి వచ్చిన ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం అత్తవారింటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుని భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోణార్క్‌లో ఉద్రిక్తత



కోణార్క్ సూర్య దేవాలయం ప్రాంగణంలో గుమిగూడిన సందర్శకులు



సందర్శన టికెట్ల కోసం బారులు తీరిన సందర్శకులు

- ఆలయ సందర్శన టికెట్ల జారీలో జాప్యం
- సందర్శకుల ఆగ్రహం
- 6 రక్షక జవాన్లతో ఘర్షణ

భువనేశ్వర్: ప్రఖ్యాత కోణార్క్ సూర్య దేవాలయం ప్రాంగణంలో ఆదివారం అవాంఛనీయ ఘటన చోటు చేసుకుంది. టికెట్ల జారీలో జాప్యాన్ని నిరసిస్తూ ఆలయ సందర్శనకు విచ్చేసిన సందర్శకులు, పర్యాటకులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీంతో విధి నిర్వహణలో ఉన్న రక్షక జవాన్లతో ఘర్షణకు దిగారు. దీంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. తీవ్ర జాప్యంతో టికెట్లు ఇవ్వడం, తనిఖీలు సైతం ఆలస్యం కావడంతో మండుటెండలో గంటల తరబడి సందర్శకులు బారులు తీరాల్సి రావడంతో నిర్వహణ యంత్రాంగంపై మండిపడ్డారు. సహనం కోల్పోయిన పర్యాటకులు రక్షక జవాన్లను అధిగమించి గేటు, ఆలయ గోడలు దూకి లోనికి ప్రవేశించేందుకు విఫల యత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలం చేరి ఇరు వర్గాల్ని సముదాయించారు. సందర్శన టికెట్లు విక్రయం, తనిఖీ ప్రక్రియ సరళీకరించి ఉభయ వర్గాలకు అనుకూలమైన విధానం అమలు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ రంగంలో తగిన శిక్షణ, అనుభవం లేని అభ్యర్థుల్ని భారత పురావస్తు శాఖ ఏఎస్ఐగా నియమించడంతో ఈ సమస్య తలెత్తినట్లు మరో వర్గం ఆరోపించింది.

అమ్మకాలు అదరహో..!



పల్లెశ్రీ మేళాలో సందర్శకుల కోలాహలం

మహానగర్ మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పల్లెశ్రీ మేళాకు జనం పోటెత్తుతున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో దక్షిణ ఒడిశాలని రాయగడ, కొంధమాల్, గజపతి, నవరంగపూర్, బౌద్ జిల్లాలకి చెందిన ఎస్ఎస్‌జీ గ్రూపు మహిళలు రూపొందించిన హస్తకళా వస్తువులు పెద్ద ఎత్తున అమ్ముడుపోతున్నాయి. వివిధ జిల్లాల్లో తయారవుతున్న పనిముట్లు, వివరాలను తోటి మహిళలు అడిగి తెలుసుకుంటున్నారు. ఆవకాయ, పచ్చళ్లు, కందిగుండ పొడర్లు, అప్పడాలు వంటి సరుకులను సందర్శకులు జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

– బరంపురం



ఆకట్టుకుంటున్న హస్తకళా పనిముట్లు



ఆయుర్వేద తైలాలు విక్రయిస్తున్న దృశ్యం

మేలు చేసిన ప్రభుత్వానికి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ కళింగ ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన



పార్టీలోకి చేరిన కళింగ వైశ్యులు

శ్రీకాకుళం రూరల్: మేలు చేసిన ప్రభుత్వానికి పట్టం కట్టాలని, కీడు చేసిన తెలుగుదేశం పార్టీని పాడి ఎక్కించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. నగరంలోని పీఎన్ కాలనీలో ఆదివారం వైఎస్సార్ సీపీకి చెందిన కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా మీ స్నేహితుడిగానే ఉంటానన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో కళింగ కోమట్లు సజావుగా వ్యాపారాలు చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పా టు చేశాను కాబట్టే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోనే వేల సంఖ్యలో ఇళ్ల పట్టాలు ఇచ్చామని, టీడీపీ హయాంలో ఒక్కటైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. మీ సహకారంతోనే మూడు సార్లు శ్రీకాకుళం నుంచి గెలవడం ఆనందంగా ఉందన్నారు.

కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం కళింగ వైశ్యుల పట్ల ఎంతో అభిమానంతో ఉందని, వైఎస్సార్ చేయూత, ఆసరా, నవరత్నాలు సంక్షేమ పథకాలన్నింటినీ అర్హులైన వైశ్యులకు అందించడంపై ఆయన హర్షం ప్రకటించారు. పీఎస్ కాలనీ, హయాతీనగరం పరిధిలో గల పలు కళింగ కోమట్లకు సుమారు 182 ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన సమక్షంలో ఎనిమిది సచివాలయాల పరిధిలో గల కళింగ కోమట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోణార్క్ శ్రీను, అంధవరపు సురేష్, ఉన్న నాగరాజు, కొండబాబు, దామోదరావు, అరుణ్‌కుమార్ గుప్తా, డాక్టర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

బొరిగుమ్మను ఎన్‌ఏసీగా ప్రకటించడంపై హర్షం



బొరిగుమ్మ బోర్డు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మను నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్(ఎన్‌ఏసీ)గా ప్రభుత్వం ప్రకటించడంతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. చిరకాల కోరిక నెరవేరినందుకు బాణసంచా కాల్చుతూ ఆదివారం పండగ చేసుకున్నారు. రాష్ట్రంలో అతి పెద్ద సమితిగా ఉన్న బొరిగుమ్మను ఎన్‌ఏసీ ప్రకటించాలని పలు రాజకీయ పార్టీలు, సంఘాలు, స్థానిక ప్రముఖులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి 2015 నుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ 25లోగా ఎన్‌ఏసీగా ప్రకటించకపోతే బంద్ చేపడతామని కూడా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటమ్ జారీ చేశారు. ఎట్టకేలకు బొరిగుమ్మను ఎన్‌ఏసీగా ముఖ్యమంత్రి ప్రకటించటంతో సోమవారం బంద్‌ను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. మొత్తానికి బొరిగుమ్మను ఎన్‌ఏసీగా ప్రకటించడంపై ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి రబినందో, జిల్లా బీజేడీ సాధారణ కార్యదర్శి కె.నారాయణ దొర, సమితి చైర్మన్ దీప్తిమయి నాయిక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు సమస్యలపై ప్రతిస్పందనే ఈ పుస్తకం



సభకు నాగలి కూడా ఆయుధమే పుస్తకాన్ని పరిచయం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రైతుల సమస్యలపై సానుభూతి చూపడమే కాకుండా వారి పోరాటాలకు ఊపిరి ఊదేలా విల్సన్ రావు 'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటి ఉందని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఏపీఎస్ భవన్‌లో జరిగిన పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుస్తక పరిచయం ప్రసంగం చేసిన కవి రచయిత డాక్టర్ కేజీ వేణు మాట్లాడుతూ వివిధ సామాజిక సమస్యల వల్ల ఆర్ద్రత, వేదనతో కూడా ప్రతి స్పందనలే ఈ కవిత్వం నిండా కనిపిస్తాయని అన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ రైతు, మహిళా, శ్రామిక, దళిత సమస్యలే వస్తువులుగా కవిత్వం రాశారని చెప్పారు. పుస్తక రచయిత కొమ్మువరపు విల్సన్ రావు మాట్లాడుతూ ఉద్యమాల పుట్టిల్లు శ్రీకాకుళంలో తన పుస్తక పరిచయ సభ సాహితీ వేత్తల సమక్షంలో జరగడం ఆనందదాయకమన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చింతాడ రామారావు, వీజీకే మూర్తి, బాలభారతి, చింతాడ తిరుమలరావు, నెట్టిమి రమణారావు, బాడాన శ్యామలరావు, కంచరాన భుజంగరావు, పూజారి దివాకర్, డాక్టర్ ఎం. బలరామ నాయుడు, తంగి ఎర్రమ్మ తదితరులు మాట్లాడారు. సభకు కె.షణ్ముఖరావు ఆహ్వానం పలుకగా, పి.దివాకర్ వందన సమర్పణ చేశారు.

పాతపట్నం రైల్వే గేటును ఢీ కొట్టిన ఆటో



ఆటో ఢీ కొట్టడంతో విరిగిన గేటు

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ జాతీయ రహదారి వద్ద ఉన్న రైల్వే గేటును ఆదివారం ఉదయం ఆటో ఢీ కొట్టడంతో గేటు విరిగిపోయింది. ఆదివారం ఉదయం పాతపట్నం నుంచి కొరసవాడ వస్తున్న ఆటో.. సైరన్ మోగుతుండగా స్పీడుగా రావడంతో గేటును ఢీకొట్టింది. దీంతో గేటు విరిగింది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేగేటును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా బొడ్డపాడు యువజన సంఘ వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న విరసం నేత సి.కాశీం

పలాస: శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట సమయానికి ఇప్పటికీ దోపిడీలో ఎలాంటి మార్పు లేదని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి, విరసం నేత ప్రొఫెసర్ సి.కాశీం చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో బొడ్డపాడు యువజన సంఘం 70 వసంతాల వార్షికోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రధాన వక్తగా కాశీం పాల్గొన్నారు. బొడ్డపాడు యువజన సంఘం నాయకులు తామాడ గణపతి, సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చినబాబు, పోతనపల్లి అప్పారావు, మదనాల దుష్యంతు వంటివారి పోరాటాలను వివరించారు. జీడి పిక్కల ధర ఎందుకు తగ్గుతోందో యువత ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మిష్క కృష్ణయ్య, రైతాంగ ఉద్యమ నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, బచ్చల విప్లవకుమార్, కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం తెలంగాణ ధిక్కార స్వరం చుక్కా రామయ్య, వివిధ సాంస్కృతిక సంఘాలకు చెందిన కళాకారులు తమ ఆటా పాటలతో ప్రజలను అలరించారు.

అంబేడ్కర్‌ది అలుపెరుగని పోరాటం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్

రణస్థలం:

భారతీయ సమాజంలో అంటరానితనంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అలుపెరుగని పోరాటం చేశారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం రెవెన్యూ పరిధిలో అంబేడ్కర్ సామాజిక భవన కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి సారథ్యంలో ఏర్పాటు చేసిన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌తో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సమాజానికి దార్శనికునిగా నిలిచిన స్థితప్రజ్ఞుడైన అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని కొనియాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌ను కలిసి దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలని కోరగా.. పది రోజుల్లోనే జీఓ అమలు చేశారని ప్రశంసించారు. అలాగే విజయవాడ నడిబొడ్డున అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని స్థాపించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తున్న అప్పలసూరి మాస్టారు, కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక భవనం నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహాలు దళిత వాడల్లోనే కాకుండా గ్రామాల్లోనూ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రజిని, మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షులు మల్లేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ, ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.ఈశ్వరరావు, టీడీపీ నాయకులు కొంద్రు మురళీమోహన్, కె.అప్పలనాయుడు, కమిటీ సభ్యులు ఉన్నారు.

వత్సవలసకు భక్తుల వరుస



అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు

వత్సవలసలో కొలువైన్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు తొలి వారం వరుస కట్టారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు ఇక్కడే బస చేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళల్లో అదనపు భద్రతా చర్యలను పోలీసులు తీసుకున్నారు. ముఖ్యంగా శ్రీకూర్మం కూడలి వద్ద నుంచి తూలుగు, ఎర్రగుడ్డి మీదుగా మళ్లీ శ్రీకూర్మం వరకు వన్‌వే ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు.

– గార



భక్తులు పూజలందుకుంటున్న రాజమ్మ తల్లి



భూలోకమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



భక్తులు తీసుకువచ్చిన వాహనాలు పార్కింగ్

మాయ'దారి' కష్టం దూరం


అజారు నుంచి పందిరి మామిడివలస రోడ్డు

- పల్లెపల్లెలో రోడ్ల నిర్మాణం
- టీడీపీ హయాంలో రహదారులన్నీ గుంతలు, గతుకుల మయం
- నేడు గ్రామీణ రహదారులకు మహర్దశ
- ప్రభుత్వ హయాంలో మెరుగుపడిన రోడ్లు

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. గతంలో కనీసం అంబులెన్సులు, ఆటోలు వెళ్లలేని గ్రామాలకు కోట్ల రూపాయల వ్యయంతో జగన్ సర్కార్ తారు, సిమెంట్ రోడ్లు వేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో జిల్లాలోని వందలాది గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలోని ప్రతి పల్లె అభివృద్ధి బాట పట్టింది. పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.235.87 కోట్లు వెచ్చించి రోడ్లు వేశారు. అలాగే ఇప్పటికే ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. రహదారులు అందుబాటులోకి రావడంతో అభివృద్ధి నడిచొచ్చినట్లయింది. పల్లెల్లో రోడ్డు సౌకర్యం ఏర్పడడంతో గ్రామీణులూ బైక్‌లు, కార్లు కొనుగోలు చేశారు. జిల్లాలో వాహనాల సంఖ్య కూడా భారీగా పెరిగింది.

నాడు-నాడు అంటూ ప్రదర్శన

ముఖ్యంగా ప్రతి శాఖలోనూ నాడు-నేడు పథకాన్ని అమలు చేశారు. గత టీడీపీ పాలనకు వైఎస్సార్ సీపీ పాలనకు తేడా తెలిసేలా పాత ఫొటోలు తీసి ఉంచారు. అలాగే అభివృద్ధి పనులు చేపట్టాక నాడు-నాడు అంటూ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రతిపక్షాలు సైతం ప్రశ్నించడానికి వీల్లేకుండా పోయింది. అలాగే రోడ్లేలేని గ్రామాలకు నూతనంగా రోడ్లు వేయడంతో అత్యవసర సమయంలోనూ రవాణాకు ఇబ్బంది లేకుండా పోయింది. అర్ధరాత్రి వేళ కూడా అత్యవసర సేవలు గ్రామాలకు చేరుకుంటున్నాయి.

'మారుమూల ప్రాంతాలపైనే దృష్టి

గత నాలుగున్నరేళ్లలో ఒక్క పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనే జిల్లా వ్యాప్తంగా 3,699 రోడు పనులు పూర్తి చేశారు. ఇందులో 41 తారు రోడ్లు, 3658 సిమెంటు రోడ్లు ఉన్నాయి. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలైన పాచిపెంట, మక్కువ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా మండలాల్లోనే ఎక్కువగా రోడ్డు పనులు చేపట్టారు. వీటితో పాటు ఆర్ అండ్‌బీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో మరిన్ని రోడ్ల పనులు పూర్తి చేశారు. ఇక చాలా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు కూడా పూర్తి కావచ్చాయని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం

సంవత్సరం	బీటీ రోడ్లు	అంచనా విలువ రూ. లక్షల్లో	సీసీ రోడ్లు	అంచనా విలువ రూ. లక్షల్లో
2019-20	18	2551.00	2983	16402.20
2020-21	12	813.50	2	14.00
2021-22	6	490.00	449	2618.73
2022-23	0	00	2	6.0
2023-24	5	217.00	222	476.00


బలిజిపేటలో పూర్తయిన రోడ్డు


నీలంవలస నుంచి గుమ్మిడి గెడ్డ రోడ్డు

ఎక్కడ చూసినా తారురోడ్డే



ఒకప్పుడు మా గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు మా మండలంలో ఎక్కడ చూసినా తారు రోడ్లే కనిపిస్తున్నాయి. గతంలో సాలూరు నుంచి శంబర రావాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. మా గ్రామానికి రోడ్లు వేసి పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యం మెరుగుపరిచారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎ. వెంకటరమణ, ఉప సర్పంచ్, శంబర

రవాణా సౌకర్యం మెరుగు పడింది



జిల్లా ఏర్పాటు తర్వాత రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. దీంతో జిల్లా కేంద్రానికి కనెక్టివిటీ బాగా పెరిగింది. అంతేగాక జాతీయ రహదారులు ఏర్పాటవుతున్నాయి. పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు వేయడంతో ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా పోయింది. ఆర్టీసీ నుంచి గిరిజన గ్రామలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి

గ్రామాల్లో పూర్తిస్థాయిలో రోడ్ల సౌకర్యం



2019 నుంచి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో గల గ్రామాల్లో పూర్తి స్థాయిలో రోడ్ల సౌకర్యం కల్పించాం. రూ. 235.87 కోట్ల నిధులతో తారు, సిమెంట్ రోడ్ల పనులు చేశాం. ఇంకా కొన్ని రోడ్ల పనులు జరుగుతున్నాయి. కొత్త రోడ్లతో పాటు పాత రోడ్లు మరమ్మతులు పూర్తి చేస్తున్నాం. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయడం వల్లే ఇన్ని పనులు పూర్తి చేయగలిగాం.

– డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, పంచాయతీతీరాజ్, ఎస్ఈ

క్లుప్తంగా

గ్రూప్-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు


పరీక్ష కేంద్రాల వద్ద పర్యవేక్షిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 ప్రిలిమినరీ రాత పరీక్షలో ఎటువంటి అవకతవకలు లేకుండా ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఎంఎస్ఎన్, శ్రీ చైతన్య, పీఎస్ఆర్, ఆదిత్య కళాశాలలో పరీక్షా కేంద్రాలను అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంగారం, నగదు చోరీ


దొంగతనం జరిగిన ఇంట్లో కబోర్డులు, బీరువాను తెరిచి చిందర వందర చేసిన దొంగలు

గజపతినగరం: మండలంలోని పురిటి పెంట మండలవారి కాలనీలో గల ఓ ఇంట్లో 12తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉంటున్న యాసర్ల అప్పల నాయుడు, భార్య అనూరాధ దంపతులు శుభకార్యం నిమిత్తం శనివారం విజయనగరం వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే చూసేసరికి తలుపులు, ఇంటిలో ఉన్న బీరువాలు మొత్తం పగులగొట్టి ఉన్నాయి. దీంతో ఇల్లంతా పరిశీలించి 12తులాల బంగారం, నగదు పోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్ రావు, ఎస్సై యు.మహేష్, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి స్థాయిలో పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్‌వీ ప్రభాకర్ రావు తెలిపారు.

మహిళ మెడలో బంగారు తాడు చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై రాజేష్

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో శనివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చొరబడి నిద్రిస్తున్న మహిళ మెడలో గల బంగారు తాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. గ్రామానికి చెందిన సురగాల సరోజనమ్మ శనివారం రాత్రి అన్ని తలుపులు వేసుకుని నిద్రిస్తుండగా అర్ధరాత్రి 1గంట-2 గంటల మధ్య సమయంలో చోరీ జరిగినట్లు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కారివలస గ్రామానికి చెందిన మండంగి రమేష్ (35) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. రమేష్ నిత్యం మద్యం తాగి వస్తుండడంతో భార్య సుహాసిని మందలించింది. దీంతో మనస్తాపం చెంది శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి ఎక్కడో పురుగు మందు తాగి రాత్రి ఇంటికి వచ్చాడు. కాసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతుండంతో గమనించిన కుటుంబసభ్యులు భద్రగిరి ఆస్పత్రికి తీసుకు వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతుడు రమేష్‌కు ఒక కుమారుడు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను బస్సు ఢీకొని వ్యక్తి మృతి


రాంబాబు మృతదేహం, నుజ్జునుజ్జయిన మోటార్ సైకిల్

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిపై అంటిపేట-లచ్చయ్యపేట గ్రామాల మధ్య రాముడు తోట వద్ద ఆదివారం రాత్రి మోటార్ సైకిలిస్టును బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందాడు. వంగర మండలం చౌదరివలస గ్రామానికి చెందిన పాలిరెడ్డి రాంబాబు (28) మోటార్ సైకిల్‌పై బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్నాడు. అదే సమయంలో పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ(హైర్)బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో ప్రమా దం జరిగింది. ఈ ప్రమాదంలో రాంబాబు సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు.

నేడు డయిల్ యువర్ డీపీటీఓ

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం సోమవారం డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమాన్ని సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని డీపీటీఓ సీహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సలహాలను ఫోన్ 9959225604 నంబర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

రంగంవలస పరిసరాల్లో ఏనుగుల సంచారం

సీతంపేట: మండలంలోని రంగంవలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. కొద్ది వారాలుగా ఇక్కడే ఏనుగులు తిష్ట వేసి పంటలు నాశనం చేస్తున్నాయని వాపోయారు. ఏనుగుల ఘీంకారాలకు రాత్రి సమయంలో నిద్ర ఉండడం లేదని గిరిజనులు తెలిపారు. ఇప్పటికైనా అటవీఅధికారులు స్పందించి ఇక్కడి నుంచి ఏనుగులు తరిమివేసేందుకు చొరవ చూపాలని కోరారు.

27న వైద్య శాఖ ఉద్యోగుల స్పందన


డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీన ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సిబ్బంది తమ జీతాల సమస్యలపై ఆర్జీలను సమర్పించవచ్చని సూచించారు.

సబ్ జూనియర్స్ బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం


రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరుకాగా..బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది, బాలికల విభాగంలో 4 గురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖ జిల్లా గోపాలపట్నంలో జరగనున్న 3వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలను శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఈ రాజు, పిఎల్ ప్రసాద్, ఆఫీషియల్స్ వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బి.జగదీష్‌లు పర్యవేక్షించారు.

ఇన్నర్‌వీల్ క్లబ్‌కు జాతీయ స్థాయి అవార్డు


జాతీయఅవార్డును అందుకుంటున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ

విజయనగరం: విజయనగరం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ సేవా, సంక్షేమ కార్యక్రమాలకు గాను జాతీయస్థాయి అవార్డు లభించిందని క్లబ్ అధ్యక్షురాలు కాపుగంటి సుధ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇన్నర్ వీల్ ఇండియా వెబ్‌సైట్‌లో డిసెంబర్ 31, 2023 వరకు విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్ 100 కంటే ఎక్కువ సేవా ప్రాజెక్టులను చేసినందుకు ఆలిండియా స్థాయిలో టాప్‌గా నిలిచిందని పేర్కొన్నారు. రాజమండ్రిలో జరిగిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో వీల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సరిత లునాని చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఈ విధంగా జాతీయ స్థాయిలో అవార్డు విజయనగరం ఇన్నర్ వీల్ క్లబ్‌నకు రావడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. ఈ ఏడాది తమ క్లబ్ తరఫున వరుసగా సేవా, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించామని, అలాగే మేజర్ ప్రాజెక్టు అయిన బీపీఎం స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుతో పాటు వివిధ పాఠశాలలకు వాటర్ ప్లాంట్‌లు, నెహ్రూ పార్కు అభివృద్ధి, ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడం తదితర సేవా కార్యక్రమాలకు గాను అవార్డు లభించిందన్నారు.

ఆదిలక్ష్మి జ్యూయలర్స్ ప్రారంభోత్సవం

- ఎస్.కోటలో సినీనటి అనసూయ సందడి


ఎస్.కోటలో జ్యూయలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ

శృంగవరపుకోట: ఎస్.కోటలో సినీనటి అనసూయ ఆదివారం సందడి చేసింది. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిలక్ష్మి జ్యూయలర్స్ బ్రాంచ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించింది. తర్వాత ఆదిలక్ష్మి జ్యూయలర్స్ అందిస్తున్న విస్తృతశ్రేణి బంగారు ఆభరణాలను ధరించిన ఆమె మాట్లాడుతూ నాణ్యమైన బంగారు, వెండి ఆభరణాల విక్రయంలో ఆదిలక్ష్మి జ్యూయలర్స్ కస్టమర్ల అభిమానం చూరగొనాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఏఎల్‌జే అధినేతలు పి.అప్పలనాయుడు, ఎం.డి అనిల్ మాట్లాడుతూ ప్రజల నమ్మకమే పునాదిగా నాణ్యత, స్వచ్ఛతే ప్రమాణంగా తమ సంస్థ ఎదిగిందని, ఆ నమ్మకాన్ని నిలుపుకుంటామని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు డీసీసీబీ చైర్మన్ వి.చినరాముడునాయుడు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి, స్థానిక పెద్దలు, ఉద్యోగులు హాజరయ్యారు.

వైభవంగా శ్రీరామచంద్ర మూర్తి పట్టాభిషేకం


వెండి మంటపం వద్ద స్వామికి పట్టాభిషేక మహోత్సవం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతా రామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేకువజాము నుంచే రామాలయంలో స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత, యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర ప్రభువుల వారిని ఆస్థాన వెండి మంటపంలో వేంచేపు జేసి రాములోరిని పట్టాభిషిక్తుడిని చేశారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పుష్పార్చన చేశారు. అనంతరం ద్వాదశి ఆరాధన, సప్తావరణ జరిపించి స్వామివారికి ఆరగింపు, పవళింపు తదితర కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎడ్లబళ్ల పరుగు ప్రదర్శన


కళ్లేపల్లిలో జరిగిన ఎడ్ల బండి పరుగు ప్రదర్శన

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో శ్రీ సదాపందీశ్వర విజయకేశవస్వామి, అభయాంజనేయ స్వామివార్ల తీర్థం సందర్భంగా ఆదివారం నిర్వహించిన అంతర్ జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా సాగింది. ఈ పోటీల్లో పలు జిల్లాల నుంచి 16 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ప్రదర్శనలో మొదటి స్థానంలో అనకాపల్లి జిల్లా నర్సయ్యపేటకు చెందిన ముమ్మన కనకరాజు ఎడ్లు నిలిచాయి. తరువాత స్థానాలను సింహాద్రిపురానికి చెందిన అభయాంజనేయస్వామి, నర్సయ్యపేటకు చెందిన ముమ్మన శివతేజ, తుమ్మికాపల్లికి చెందిన గౌరీశ్వర్, కలగాడకు చెందిన పోలిపర్తి రామునాయుడు, వేపాడకు చెందిన వంటాకు సూర్యనారయణ, బోనంగికి చెందిన మోదిమాంబ ఎడ్ల బళ్లు వరుసగా సాధించాయి. విజేతలకు వరుసగా రూ.12, 10, 8, 6, 4, 3, 2 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు.

ధాన్యం, గడ్డివాము దగ్ధం

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి పుత్రయ్యకు చెందిన 30 ధాన్యం బస్తాలు, గడ్డివాము ఆదివారం దగ్ధమయ్యాయి. అయితే ఈ ప్రమాదం ఏవి ధంగా జరిగిందో తెలియరాలేదు. విషయం తెలుసుకున్న ఆర్.ఐ శ్రీదేవి, వీఆర్వో వీరన్న ఘటనాస్థలానికి చేరుకుని సుమారు రూ. 50వేల నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

ఆక్రందన, ఆవేదన

- టికెట్ కేటాయింపుపై పునరాలోచించాలి : టీడీపీ మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు
- నాకు అన్యాయం చేశారు : కరణం శివరామకృష్ణ


మద్దతుదారులతో సమావేశమైన కేపీ నాయుడు

గజపతినగరం రూరల్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గజపతినగరం ఎమ్మెల్యే టికెట్ కేటాయింపుపై తీసుకున్న నిర్ణయం చాలా బాధనిపించిందని, గజపతినగరం టీడీపీ మాజీ ఎమ్మెల్యే కేపీ.నాయుడు ఆవేదన వెళ్లగక్కారు. అలాగే అదే పార్టీకి చెందిన నియోజకవర్గం సీనియర్ నాయకుడు శివరామకృష్ణ తనకు టికెట్ కేటాయించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు ఆదివారం వారిద్దరూ వేర్వేరుగా తమ అనుచరులు, పార్టీ శ్రేణులతో మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేపీ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబును 53రోజులు జైలులో పెట్టినప్పుడు ఏరోజూ కూడా టికెట్ కేటాయించిన శ్రీనివాస్ కానీ, ఆయన తండ్రి కొండలరావు కనీసం పత్రికల్లో కూడా ఖండించలేదని అటువంటి వ్యక్తులకు అధిష్ఠానం టికెట్ కేటాయించడం అత్యంత బాధాకరంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో గడిచిన నాలుగున్నరేళ్లుగా ఉండి టీడీపీకి సేవ చేస్తే అదిష్టానం తనకు పూర్తిగా అన్యాయం చేసిందని కార్యకర్తల ముందు వాపోయారు. ఇప్పటికైనా గజపతినగరం నియోజకవర్గం అభ్యర్థిత్వంపై అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అలాగే నాలుగున్నరేళ్లుగా టీడీపీని నమ్ముకుని ఎన్నో సేవాకార్యక్రమాలను చేసిన తనకు గజపతినగరం అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తారని వేయికళ్లతో ఎదురుచూస్తుంటే అధిష్ఠానం దొంగదొబ్బతీసిందని కరణం శివరామకృష్ణ తన మద్దతుదారుల ముందు వాపోయారు. పదేళ్లుగా పార్టీని నమ్ముకుని ఎంతో డబ్బు ఖర్చుచేశానని గజపతినగరం టికెట్ తనకే ఇస్తారని పలువురు నాయకులు ఆశచూపించి మోసం చేయడం తట్టుకోలేకపోతున్నానంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటినుంచి పార్టీలో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకూడదని, పదవులకు రాజీనామాలు చేయడంతో పాటు స్తబ్దుగా ఉండాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి గజపతినగరంలో ర్యాలీ నిర్వహించారు.


పార్టీశ్రేణుల ముందు కన్నీటి పర్యంతమవుతున్న శివరామకృష్ణ

న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నెలబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కారం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ అన్నారు. మారుతున్న పరిస్థితుల్లో న్యాయవ్యవస్థలోనూ మార్పులు రావలసి వుందన్నారు. న్యాయం కోసం సుదీర్ఘకాలం పాటు వేచి చూడాల్సిన పరిస్థితుల్లో మార్పు రావాలన్నారు. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టి వివాదాల పరిష్కారంలో మెలకువలను న్యాయవాదులు తెలుసుకోవాలన్నారు. అన్నదమ్ముల మధ్య ఏర్పడిన ఆస్తి వివాదం పరిష్కారం కావాలన్నా, భార్యాభర్తల మధ్య స్పర్థలు ఏర్పడితే వారు విడిపోవాలనుకున్నా అటువంటి సమస్యల పరిష్కారం కూడా 20 ఏళ్ల అవసరమా అనేది ఆలోచించాల్సి ఉందన్నారు.

పాత జిల్లా కోర్టు ఆవరణలో నిర్మించనున్న జిల్లా కోర్టు కాంప్లెక్స్ నూతన భవన సముదాయానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ ఆదివారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కోర్టు నూతన భవనాల నిర్మాణానికి రూ.99.20 కోట్లను మంజూరు చేసింది. 6.58 ఎకరాల విస్తీర్ణంలో సెల్లార్ కాకుండా ఆరు అంతస్తుల్లో ఆధునిక వసతులతో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ భవనాలను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్న యువతీ యువకులను సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహించాల్సి ఉందన్నారు. విజయనగరంలో నూతన కోర్టు భవనాల ద్వారా మంచి వసతులు సమకూరనున్నాయని, వీటిని వినియోగించుకొని సమాజానికి సేవలు అందించాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలు న్యాయవ్యవస్థపై ఎన్నో ఆశలు కలిగి ఉన్నారని, వారి ఆశలు ఆకాంక్షలు నెరవేర్చేలా న్యాయవ్యవస్థను నిలపాల్సి ఉందన్నారు. ఇక్కడ చేపడుతున్న కోర్టు భవనాల నిర్మాణం వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్రంలోని కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.186 కోట్లు కేటాయించి ఇందులో తొలి విడతగా రూ.45 కోట్లు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుగా రూ.30 కోట్లు అందజేసిందని, మొత్తం రూ. 75 కోట్లలో రూ.50 కోట్ల మేరకు పాత పనులకు బిల్లులు చెల్లించామన్నారు. మిగిలిన రూ.20 కోట్లను మార్చి నెలాఖరులోగా ఖర్చు చేయాల్సి ఉందన్నారు.


కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ

విజయనగరం ప్రాంత చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా ఇక్కడి న్యాయస్థానాల భవనాలకు ఆకృతులను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు చెప్పారు. ఈ భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం సహా పలువురు న్యాయమూర్తులు తోడ్పాటు అందించారని చెప్పారు.

రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరాం మాట్లాడుతూ ఈ భవనాల నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా పూర్తి సహకారం అందిస్తామన్నారు. జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి, విజయనగరం న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు చొక్కాపు దామోదర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కె.వి.ఎన్.తమ్మన్నశెట్టి, రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా రామారావు, ప్రభుత్వ న్యాయవాది టి.వి.శ్రీనివాస రావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి తదితరులు మాట్లాడారు.

ఎస్పీ దీపిక పాటిల్ మాట్లాడుతూ న్యాయాధికారుల సహకారంతో చిన్నపిల్లలపై అత్యాచారాలకు సంబంధించిన పోక్సో కేసులు త్వరితంగా పరిష్కరించి నిందితులకు శిక్ష పడేలా చేయగలుగుతున్నట్టు చెప్పారు. జిల్లా కోర్టు భవనాలను రెండేళ్ల వ్యవధిలో నిర్మాణం పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం ద్వారా సహకారం అందిస్తామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ దంపతులను, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా కోర్టు న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలన అధికారి కమలాకరరావు, సెంట్రల్ నాజర్ పి.రామచంద్రరావు, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ విజయరత్నం, ఇ.పి.డి.సి.ఎల్. ఎస్ఈ లక్ష్మణరావు, ఇ.పి. డి.సి.ఎల్. ఈఈ హరి తదితరులు పాల్గొన్నారు.